
# అత్రి

## 'అనంతం'



"నీ పేరేవిఁటి?"
"ప్రసాద్."
"పూర్తి పేరు?"
"వి. శివరామకృష్ణప్రసాద్."
"వి. అంటే?"
"వేమూరి."
"మీ నాన్నగారి పేరు?"
"వెంకటకృష్ణయ్యగారు."
"మీ రెంత మందిఅన్నదమ్ములు?"
"నే నొక్కడినే. గోత్రం కూడా చెప్పనా?"
"ఏమి టా తలతిక్క జవాబు?"
"ఇంటర్వ్యూలో లాగా, పెళ్లి సంబంధం చూసే వాళ్లలాగా అడుగుతుంటేను"
"అధిక ప్రసంగం చెయ్యకు. మైండ్ యువర్ బిజినెస్."
"నేను బాగానే రాసుకుంటున్నాను - వంచిన తల ఎత్తకుండా. మీరే నన్ను అనవసరంగా డిస్టర్బ్ చేశారు. ఇంకా ఏమన్నా అర్జంటుగా అడగాల్సినవి

ఉంటే అడిగెయ్యండి త్వరగా. ఆగగలిగితే పరీక్ష రాయటం అయ్యేదాకా ఆగండి. లేకపోతే వెళ్లేప్పుడు అడ్రసూ, ఫోను నెంబరూ ఇస్తాను. ఇంటికి వచ్చో, ఫోను చేసో అడగండి.'' విసురుగా అని మళ్లీ రాతలో పడ్డాడు ప్రసాదు.

''ఎంత పొగరు?'' అనుకుంటూ ముందుకి సాగాడు ఇన్విజిలేటరు విశ్వనాథం.

విశ్వనాథానికి చాలా సిన్సియర్‌గా పనిచేస్తాడనే మంచి పేరుంది. ఏ క్లాసూ, ఎప్పుడూ మానడు. టైముకి వెడతాడు. పాఠాలు కూడా బాగా చెపుతాడని పిల్లలు చాలా మంది ఇష్టపడతారు. అయితే కిట్టనివాళ్లు మాత్రం ఛాదస్తుడనీ, క్లాసుకి వచ్చిన విద్యార్థులకి మాత్రమే అటెండెన్సు ఇస్తాడు కనక 'కర్కోటకుడ'నీ. అనవసరంగా స్టూడెంట్సుతోనూ, స్టాఫ్ రూంలోనూ మాట్లాడడు కనక 'అన్‌సోషల్' అనీ, ఎక్కువ లైబ్రరీలో ఏదో చదువుతూనో, రాసుకుంటూనో గడుపుతాడు గనక 'పుస్తకాల పురుగ'నీ - రకరకాలుగా అంటూ ఉంటారు. ఇవి కూడా తెలుసు విశ్వనాథానికి. కాని పట్టించుకోడు. తనకు వచ్చిన సిన్సియర్ అనే పేరు నిలబెట్టుకోటానికి శాయశక్తులా ప్రయత్నం చేస్తుంటాడు.

అందుకే ఇన్విజిలేషన్ చేసేప్పుడు చాలా స్ట్రిక్టుగా ఉంటాడు. విద్యార్థులు తన కాలేజీ వాళ్లు కాకపోతే మరింత బిగుసుకుపోతాడు. బహుజాగ్రత్తగా అందరి హాల్ టిక్కట్లూ, వాటి మీద ఉన్న ఫోటోలోని మొహమూ, మనిషి మొహమూ పోల్చి చూస్తాడు. హాల్ టిక్కెట్ మీద నెంబరూ, ఆన్సర్ షీట్ మీద నంబరూ, టేబుల్ మీద నంబరూ సరిగా ఉన్నాయో, లేదో పరిశోధిస్తాడు. అందరికీ పదిహేను ఇరవై నిముషాలు పట్టే ఈ పని విశ్వనాథానికి అరగంట పైగానే పడుతుంది. అతనితోపాటు అదే గదిలో డ్యూటీ ఉన్న వాళ్లకి సుఖం - అంత పనీ ఛాదస్తంగా తనే చేస్తాడు కనక.

డూప్లికేట్ హాల్ టికట్ పుచ్చుకుని ఆ కుర్రవాడి ముఖాన్ని చాలా కోణాల్నించి పరిశీలించి చూశాడు. 'కనుముక్కు తీరు సరిపోతోంది. కాని ఎక్కడో కొట్టొచ్చినట్టు తేడా ఉంది. 'కొంప తీసి హాల్‌టికెట్ మీద ఉన్న ఫోటోలోని మనిషీ, పరీక్ష రాస్తున్న మనిషీ ఒకరు కారేమో? అన్నదమ్ములో, కవలలోనేమో?' ఒకళ్ల బదులుగా మరొకళ్లు పరీక్ష రాశారని పేపర్లో పడిన సంఘటనలన్నీ విశ్వనాథం మనస్సులో మెదిలాయి. చాలా ఉద్వేగపడిపోయాడు. ఈ రహస్యం ఛేదిస్తే తన పేరూ పేపర్లో పడుతుంది - 'ఫలానా విశ్వనాథం చాలా స్ట్రిక్టుగా వెరిఫై చేసి ఇంపర్సనేషన్ చేసిన ఫలానా కాండిడేటుని పట్టుకున్నాడు' అని.

'ఎక్స్‌క్యూజ్ మీ!''

విశ్వనాథం ఊహలకి మరొక అభ్యర్థి పిలుపు బ్రేకు వేసింది. విశ్వనాథం వాస్తవంలోకి వచ్చేప్పటికే కో ఇన్విజిలేటర్ ఆ అభ్యర్థికి ఎడిషనల్ షీటు ఇవ్వటం జరిగిపోయింది. విశ్వనాథం సిగ్గుపడ్డాడు. 'ఇంతవరకూ త నెప్పుడూ తోటి ఇన్విజిలేటర్‌కి పనిచేసే ఛాన్సు ఇవ్వలేదు. ఇప్పు డిచ్చాడూ అంటే తన సిన్సియారిటీ తగ్గిపోయిందన్నమాట. అయినా సిన్సియారిటీ కోసమేగా తా నింతగా ఆపత్రయపడుతోంది' అని సద్దుకున్నాడు. 'పోనీ! ఐడెంటిఫికేషన్ మార్క్సు చూపించమంటే?' ఆ ఊహ రాగానే భయం వేసింది.



## మరో లాల్‌బహదూర్!

భారత ఆర్థిక వ్యవస్థకు నవజీవనం పోయడానికి నిరంతరం శ్రమిస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ మన్మోహన్‌సింగ్ ప్రతి పైసాను ఎక్కడ ఎలా ఖర్చు చేయాలా అనే విషయంపై చాలా కఠినంగా వ్యవహరిస్తాడనే పేరు ఉంది.

ఇంటి విషయాల్లోనూ అంతే. ఒక రోజు సింగ్ గారింట్లో గోధుమ పిండి నిండుకుందిట. ఆదరాబాదరాగా వంట మనిషి కారు డ్రైవర్‌ను కాస్త పిండి తెచ్చిపెట్టమని అడిగాడు. ఆ డ్రైవరేమో ''అయ్యగారు ఒప్పుకోరు. ఇది ప్రభుత్వం వారి కారు'' అన్నాడట. అంతేకాదు - సింగ్ గారమ్మాయి కాలేజీకి బస్సులోనే వెళ్లి వస్తుంది. ఆర్థిక మంత్రిగారి అమ్మాయి బస్సెక్కడం చూసిఅంతా ఆశ్చర్యపోతుంటారు. సింగ్ సమీప బంధువులు ఒక బ్యాంక్ గెస్ట్ హౌస్ గది తీసుకున్నారని తెలిసి వెంటనే మంత్రిగారు సదరు బ్యాంకు అధికారులను 'మీకు బంగళాలు ఉన్నది మంత్రిగారి చుట్టాలకు కట్టబెట్టడానికి కాదు. వెంటనే వారిని ఖాళీ చేయించి పంపివేయండి' అని ఆజ్ఞాపించారుట!

ఈ వరస చూస్తుంటే మరో లాల్‌బహదూర్ శాస్త్రి అనిపించడంలేదు.

సేకరణ: బి.ఆర్.మూర్తి [మచిలీపట్నం]

ఇంతకుముందొకసారి ఇలాగే ఒక కాండిడేటు గురించి అనుమానం వచ్చి ఐడెంటిఫికేషన్ మార్క్సు చూపించమంటే ఎంత అల్లరయింది? అదే రూమ్‌లో ఆడపిల్ల లున్నారని కూడా ఆలోచించకుండా, తనే మొండిగా చూపించాలని పట్టుబట్టాడు, అవి ఎక్కడున్నాయో హాల్ టికెట్‌లో చదివి కూడా! అప్పుడే, మరీ అంత స్ట్రిక్టుగా ఉండకూడదని ప్రిన్సిపాల్ చేత చెప్పించుకున్నాడు కూడా! ఆ సంగతి తనకి మాత్రం తెలియదా? అది ఆ పిల్లవాడి మొండితనం చూసి వచ్చిన పట్టుదల. అంతే!

అయినా ఈ ప్రసాదు ఐడెంటిఫికేషన్ మార్క్సు ఎక్క డున్నాయో చూద్దాం అనుకుని హాల్ టికెట్ తీశాడు. ''1. ఎ బిగ్ మోల్ ఆన్ ది లెఫ్ట్ పిన్నా. 2. ఎ స్కార్ ఆన్ ది బ్రిడ్జి ఆఫ్ ది నోస్'' అని ఉంది. రెండు కూడా అతన్ని అడక్కుండానే చూడవచ్చు. హాల్లో తిరుగుతున్నట్టుగా అతని దగ్గరికి వెళ్లాడు.

ముక్కు మీద మచ్చ ఫోటోలో లాగానే మొహం మీద అచ్చుగుద్దినట్టుగా ఉంది. తెల్లని ఎడమ చెవి పై భాగం మీద స్పష్టంగా నల్లని పుట్టుమచ్చ. ఇంక అనుమానించేందుకేమీ లేదు. మరైతే ఇంత తేడా ఎందుకుంది ఫోటోకి, మనిషికి?

అతి సిన్సియర్ విశ్వనాథం సీరియస్‌గా ఆలోచించటం మొదలుపెట్టాడు. బుర్రబద్దలు కొట్టుకున్నాడు. బుర్ర గోక్కున్నాడు. హఠాత్తుగా ఏదో తట్టింది. మనిషినీ, ఫోటోనీ మార్చి చూసి నవ్వుకున్నాడు. ఈ మాత్రం విషయం ఇంతసేపూ తన కెందుకు తట్టలేదు? ఇంత చిన్న విషయానికి తనెంతగా ఆలోచించాడు? ఎంత సమయాన్ని వృధా చేశాడు? ఆలోచనతో పరధ్యానగా ఉండి తన సిన్సియారిటీకి మచ్చ తెచ్చేట్టుగా కూడా ప్రవర్తించాడే? ఈ మాట గుర్తుకి రాగానే తన ప్రవర్తనకి కారకుడైన ఆ కుర్రవాడి మీద కోపం వచ్చింది. కాని అతన్ని తనేం చెయ్యగలడు? తన నిస్సహాయత కోపాన్ని ఇంకా ఎక్కువ చేసింది.

ఆఖరి నిమిషం దాకా రాస్తూ కూర్చున్న ఆ ప్రసాద్‌ని చూస్తే కోపం మరీ ఎక్కువైంది. ఎవరైనా పేపరు ముందిస్తే ఇంకా టైముందిగా, ఆలోచించు, మరో పాయింట్ తట్టచ్చు, ఇంకో మార్కు రావచ్చు, అని సలహా లిచ్చే విశ్వనాథానికి. లాంగ్ బెల్ అయింది. అందరూ పేపర్లిచ్చేశారు. అప్పుడు తీరికగా దారం కడుతున్న 'పొగరుబోతు' ప్రసాద్ మీద కోపం తీర్చుకునే ఛాన్సు దొరికింది విశ్వనాథానికి.

''బెల్ అయి రెండు నిముషా లయింది. ఇప్పుడు కడుతున్నావా తీరికగా ఇచ్చెయ్'' లాక్కున్నంత పని చేశాడు.

''చూడండి సార్! పిచ్చి పిచ్చి ప్రశ్నలడిగి నా టైము పది నిమిషాల పైగా వృధా చేశారు మీరు. అందువల్ల చివరి ప్రశ్న కుదించి రాయాల్సి వచ్చింది. నాకు కనీసం ఐదు నిమిషా లెక్కువ టైమివ్వచ్చు'' అన్నాడు ప్రసాద్ దారం కడుతూనే.

''నయం! నేను గనక పది నిమిషాల్లో తేల్చాను. లేకపోతే యేమిటోయ్! ఫోటో ఒక స్టైల్‌లో తీసుకుంటారు. పరీక్షకి వచ్చేప్పుడు మరొక స్టైలు. మీకు ఫాషన్ల మీద ఉన్న శ్రద్ధ చదువు మీద ఉండదు. అయినా పరీక్షల ముం దెవరన్నా తిరపతి వెడతారా? నీలాగా చదువు పరీక్షల విలువ తెలియని వాళ్లు తప్ప.'' అనదలచుకున్న నాలుగు మాటలూ అనేశాడు విశ్వనాథం.

పేపరు అందిస్తున్న ప్రసాదు ముఖంలోని విచారం, కళ్లలో నీళ్లు చూసి జుట్టుపోయిందని బాధపడుతున్నావా? సహజమేలే. అసలే మీ కుర్రాళ్లకి షోకు లెక్కువ. నిజం చెప్పద్దూ. నీది భలే అందమైన జుట్టు. నాకే బాధగా ఉంది'' అన్నాడు. విశ్వనాథంలోని కవి సిన్సియర్‌గానే బాధపడ్డాడు.

''మే మందరం కూడా అందుకు బాధపడుతూనే ఉన్నాము. కాని వాడు బాధపడేది మాత్రం దానికి కారణమైన వాళ్ల నాన్న గురించి. ప్రసాదు స్నేహితుడు కాబోలు, మరో అభ్యర్థి'' అన్నాడు.

''ఏం పాపం! ఆయన బలవంతం చేశారా?'' విశ్వనాథం గొంతులో వ్యంగ్యం.

''కాదు. పోయారు. ఇరవై రోజు లవుతోంది!''

అతి సిన్సియర్ విశ్వనాథం అవాక్కయిపోయాడు.